

సోమశిలలో 29.906 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 29.906 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 3 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,788
3 శాతం జీఎస్టీతో..	రూ.5,962
నవర (8 గ్రా)	రూ.47,696

గరిష్టం/కనిష్టం
30.3 /23.4

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 51 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. బుధవారం ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

రైళ్లలో విస్తృత తనిఖీలు



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

నెల్లూరు(క్రైమ్): గుంతకల్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు సంక్రాంతి, రానున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రైళ్లు, రైల్వే స్టేషన్లలో గడిచిన మూడు రోజులుగా రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వే ఎస్పీ భుజంగరావు, రైల్వే ఎస్సైలు హరిచందన, మాలకొండయ్య తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేస్తున్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రయాణికులను హెచ్చరిస్తున్నారు. దొంగతనాల నియంత్రణ చర్యల్లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఫిన్స్ సహాయంతో కేసులు, నేరచరిత్ర ఏమైనా ఉందా అని ఆరా తీస్తున్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

20న సామాజిక సాధికార బస్సు యాత్ర

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 20న ఆత్మకూరులో నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ మధ్యాహ్నం 2 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల వద్ద ఉన్న మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ యువత

నెల్లూరురూరల్: నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడులో ఏపీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ రూరల్ యువత ఘనంగా సత్కరించారు. జాతీయ రహదారి వద్ద నుంచి కనుపర్తిపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా సీనియర్ న్యాయవాది పొన్నవోలు మధుసూదన్‌రెడ్డి, ప్రవాస భారతీయుడు పొన్నవోలు విజయ్ కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి తనయులు కార్తీక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, నేతలు చిన్న ఓబయ్య, టీవీఎస్ కమల్, భూపతి, జానాసాయి, మాదాబాబు ఆధ్వర్యంలో 200 మంది యువత పొన్నవోలు నివాసానికి చేరుకుని ఆయనను సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజలకు, యువతకు ఎల్లప్పుడూ తాను అవసరమైన సేవలు అందిస్తానన్నారు.

కండలేరులో 12.615 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 12.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

సంబరాల సంక్రాంతి



ఇనమడుగులో మహిళలు తీర్చిదిద్దిన ముగ్గు

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతిని జిల్లా ప్రజలు మూడు రోజులపాటు ఆనందోత్సాహాలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. బంధుమిత్రులందరూ ఒకచోట చేరి వేడుక చేసుకున్నారు. తొలి రోజు భోగి మంటలు వేసి భోగభాగ్యాల భోగి పండగతో సంక్రాంతికి స్వాగతం పలికారు. రెండో రోజు పెద్ద పండగ సంక్రాంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. పితృదేవతలకు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి వారి సమాధుల వద్ద పూజలు చేశారు. మూడో రోజు పశు సంపదను పూజిస్తూ కనుమ పండగను వేడుకగా నిర్వహించారు. పల్లెల్లో యువత, పిల్లలు ఆటపాటలతో అలరించారు. పలుచోట్ల ఎడ్ల పందేలు హోరాహోరీగా జరిగాయి.

వేడుకగా మూడు రోజుల పండగ

- సంప్రదాయబద్ధంగా సంక్రాంతి, కనుమ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా ఆటలు, ముగ్గుల పోటీలు
- ఆనందోత్సాహలతో జరుపుకొన్న ప్రజలు



నెల్లూరులోని జాఫర్ సాహెబ్ కాలువలో నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం



నరసింహకొండపై అశ్వవాహనంపై విహరిస్తున్న నృసింహస్వామి

నెల్లూరు(బృందావనం): పల్లెల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. బంధుమిత్రులు ఆప్యాయతలు, అనురాగాలు, పలకరింపులతో పెద్ద పండగను ఆనందంగా జరుపుకున్నారు. ఆదివారం భోగి మంటలు వేసి భోగి పండగను అత్యంత వేడుకగా జరుపుకోగా సోమవారం పెద్ద పండగ మకర సంక్రాంతిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. గృహాల్లోనూ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పితృదేవతలను స్మరించుకుంటూ వారి సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం పాడిపంటలు, సిరి సంపదలు వృద్ధి చెందాలని కోరుకుంటూ రైతులు కనుమ పండగను వేడుకగా నిర్వహించుకున్నారు. పశుసంపదను పూజించారు. పంట పొలాల్లో దిష్టిబొమ్మలను ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు తమ ఇంటి ముంగిళ్లలను రంగవల్లులతో తీర్చిదిద్దారు. గంగిరెద్దు విన్యాసాలు పల్లెల్లో అలరించాయి. చిన్నారులు గాలిపటాలను ఉత్సాహంగా ఎగురవేశారు. యువత, చిన్నారులు ఆటపాటలతో అలరించారు. గ్రామాలు, పట్టణాల్లో ఆటలు, ముగ్గుల పోటీలు, ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలతో పల్లెలు, పట్టణాలు, నగరం సందడిగా మారాయి.



తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న నెల్లూరు నగరవాసులు

వైభవంగా భ్రమరాంబ మల్లేశ్వరుల తెప్పోత్సవం

సంక్రాంతి వేడుకల్లో భాగంగా నెల్లూరు నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో ఉన్న జాఫర్ సాహెబ్ కాలువలో మంగళవారం రాత్రి శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించారు. నవాబుపేటలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి స్వామి, అమ్మవారు సర్వాలంకారశోభితులై మంగళ వాయిద్యాలు, భక్తుల నామస్మరణ నడుమ మైపాడు గేట్ సెంటర్‌కు చేరుకున్నారు. తెప్పోత్సవం జరిగే జాఫర్‌సాహెబ్ కాలువ సమీపంలో ఉన్న కల్యాణ మండపంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి విశేషాలంకారంలో కొలువుదీరి భక్తులను కటాక్షించారు అనంతరం జాఫర్‌సాహెబ్ కాలువలో సుందరంగా, విద్యుద్దీపాలంకరణలతో తీర్చిదిద్దిన తెప్పపైకి స్వామి, అమ్మవారు వేంచేపు చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం తెప్పపై స్వామి, అమ్మవార్లు జలవిహారం చేశారు. వైభవంగా జరిగిన తెప్పోత్సవంలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూ అనుగ్రహించారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన వేలాదిమంది భక్తులు, ప్రజానీకంతో మైపాడుగేట్ ప్రాంతం కిటకిటలాడింది. అలాగే కనుమ పార్వేట ఉత్సవం వేడుకగా నిర్వహించారు.

తరలివచ్చిన దేవతామూర్తులు.. దర్శించుకుని తరించిన భక్తులు

నగరంలోని వివిధ దేవస్థానాలకు చెందిన దేవతామూర్తులు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని శ్రీసిద్ధివిఘ్నేశ్వరాలయం నుంచి మైపాడుగేట్, కిసాన్‌నగర్, పత్తివారిసత్రం వరకు కనుమ సందర్భంగా పార్వేట ఉత్సవంగా తరలివచ్చి విశేషాలంకరణల్లో కొలువుదీరారు. శ్రీసిద్ధివిఘ్నేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి అమ్మవార్లు తదితర దేవతామూర్తులు కొలువుదీరారు. ఆయా దేవస్థానాల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు తాత్కాలిక ప్రతిష్ఠలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, భక్తబృందాలు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.



కోవూరు మండలం ఇనమడుగులో ముగ్గుల పోటీల్లో భాగంగా మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు



బండను లాగుతున్న ఎద్దులు

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- బ్రాహ్మణక్రాకలో రాష్ట్రస్థాయి పోటీలు
- విజేతగా వైఎస్సార్ జిల్లా ఎద్దులు

జలదంకి: సంక్రాంతిని పురస్కరించుకుని జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని శివాలయం వద్ద సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు వేడుకగా నిర్వహించారు. బ్రాహ్మణక్రాక ఎడ్ల సంఘం ఆధ్వర్యంలో ఏటా సంక్రాంతి రోజున రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పోటీలను కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు నిర్ణీత సమయం 20 నిమిషాల వ్యవధిలో అత్యధికంగా 3,603 అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలిచాయి. వైఎస్సార్ జిల్లా గోసులవారిపల్లెకు చెందిన పాపిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎద్దు నిర్ణీత సమయంలో 3,300 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో, వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డిపల్లెకు చెందిన మూలె ప్రసాద్‌రెడ్డి ఎద్దు 3,094 అడుగుల దూరం బండను లాగి తృతీయస్థానంలో, వైఎస్సార్ జిల్లా చాపాడుకు చెందిన తొగరిశెట్టి వెంకటేశ్వరశర్మ ఎద్దు 2,919 అడుగుల దూరం బండను లాగి నాలుగో స్థానంలో, వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన వినుకొండ రఫీకి చెందిన ఎద్దు 2,731 అడుగుల దూరం బండను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. కాగా ఈ పోటీలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఎడ్ల బండలాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన ఎడ్ల యజమాని కుర్రా వెంకటేష్‌యాదవ్‌కు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రూ.50 వేల నగదు బహుమతి, జ్ఞాపిక అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని పాపిరెడ్డి వెంకటరమణారెడ్డికి ఇందూరి శంకరలింగం జ్ఞాపకార్థం ఇందూరి బ్రదర్స్ రూ.40 వేల నగదు బహుమతి అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని మూలె ప్రసాద్‌రెడ్డికి వేలమూరి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వేలమూరి బ్రదర్స్ రూ.30 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని తొగరిశెట్టి వెంకటేశ్వరశర్మకు పున్నం రోశిరెడ్డి రూ.20 వేలు, ఐదో స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని వినుకొండ రఫీకి దేవరపల్లి కొండారెడ్డి రూ.15 వేల నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన ఎడ్ల యజమానులకు ప్రోత్సాహకంగా రూ.5 వేల చొప్పున నిర్వాహకులు అందించారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారికి అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



విజేతగా నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

సర్వేపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో 6,610 ఎకరాలకు సంబంధించి 5,445 కుటుంబాలకు భూపట్టాలను అందజేశామని, సమగ్ర సర్వేపల్లి అభివృద్ధే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కాకాణి సోమవారం తన స్వగ్రామం తోడేరులో కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో తోడేరు ఎస్సీకాలనీకి చెందిన పేదలకు భూపట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనుకున్న లక్ష్యం కన్నా 1000 ఎకరాలు అదనంగా పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 7 వేల ఎకరాల భూములను పేదలకు అందజేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. రైతుల ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తోడేరు గ్రామంలో రూ.50 లక్షలతో రామాలయాన్ని నిర్మిస్తున్నామని, రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ సాయిగణేష్‌బాబు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, సర్పంచ్ పెంచలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, వీఆర్వో పేరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి తన కుటుంబసభ్యులతో కలసి తండ్రి, మాజీ సమితి అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని ఘన నివాళులర్పించారు. కుమార్తె పూజితారెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



తోడేరులో పేదలకు భూపట్టాలు పంపిణీ చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

జిల్లాకు 15 మంది తహసీల్దార్లు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కలెక్టర్ ఎండీ ఇంతియాజ్ జిల్లాకు 15 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఉన్న సీతారామంను లింగసముద్రం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బాపట్ల కలెక్టరేట్‌లోని కృష్ణకాంత్‌ను కందుకూరుకు, బాపట్ల ఆర్డీఓ కార్యాలయ ఏఓ శ్రీచరణ్‌ను మర్రిపాడుకు, గుంటూరు ఆర్డీఓ కార్యాలయ ఈఓ ఇస్మాయిల్‌ను విడవలూరుకు, గుంటూరు కలెక్టరేట్‌లోని పూర్ణచంద్రరావును వెంకటాచలానికి, తెనాలి ఆర్డీఓ కార్యాలయ తహసీల్దార్ వెంకటస్వామిని రాపూరుకు, నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఏవీపీ చంద్రను వరికుంటపాడుకు, రేపల్లె ఆర్డీఓ కార్యాలయ ఏఓ జాన్‌పీటర్‌ను దగదర్తికి, చీరాల ఆర్డీఓ ఏఓ పి.నరసింహరావును అనంతసాగరానికి, గుంటూరు ఆర్డీఓ కార్యాలయ ఏఓ శివనాగిరెడ్డిని ఆత్మకూరుకు, బాపట్ల కలెక్టరేట్‌లో ఉన్న గోపీకృష్ణను చేజర్లకు, ఒంగోలు కలెక్టరేట్‌లోని రాజ్యలక్ష్మిని కలెక్టరేట్‌లోని ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి, ఒంగోలు కలెక్టరేట్‌లోని చిరంజీవిని మనుబోలు తహసీల్దార్‌గా, మార్కాపురంలోని సీహెచ్ శ్రీనివాసరావును కలువాయికి, ఒంగోలు కలెక్టరేట్‌లోని శ్రావణ్‌కుమార్‌ను కొండాపురం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు సముచిత స్థానం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు(వేదాయపాళెం): వైఎస్సార్‌సీపీ చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించిందని, ఆ పార్టీకి బీసీలకు అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కోరారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న తన నివాసంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5 మంది బీసీలకు రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించారని, 11 మంది బీసీలకు మంత్రివర్గంలో చోటు కల్పించడంతోపాటు మరో 11 మంది బీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారని తెలిపారు. ఇంతవరకు ఏ రాష్ట్రంలోనూ బీసీలకు ఈ స్థాయి గుర్తింపు, హోదా లభించలేదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో అధికశాతం బీసీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సమాది శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, విశపు లలితారాం, బుధవరపు బాలాజీ, నీళ్ల మల్లికార్జున, జిలానీబాషా, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



చెరువు కట్టపై వ్యూ పాయింట్ వద్ద సందర్శకుల రద్దీ



విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు

కిక్కిరిసిన నేలపట్టు

దొరవారిసత్రం : ఉమ్మడి నెల్లూరు జిల్లా దొరవారి సత్రం మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి సెలవుల కారణంగా రాష్ట్రంతోపాటు, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మూడు రోజులుగా సందర్శకులు క్యూ కడుతున్నారు. ఎటుచూసినా విహంగాల విన్యాసాలు, కిలకిలరావాలు, చిన్నారుల ఆటపాటలతో సందడి నెలకొంది. విడిది చేస్తున్న విహంగాలను వీక్షించి పరవశించి పోతున్నారు. భోగి పండగ నాడు అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా కొండ తిరుగుడు ఉత్సవం

సంగం: సంక్రాంతి సందర్భంగా సంగంలో కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి కొండతిరుగుడు ఉత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ గ్రామోత్సవం కొరిమెర్ల, తలుపూరుపాడు, తరుణవాయి గ్రామాల్లో వైభవంగా జరుగుతోంది.



క్లుప్తంగా

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

బిట్రగుంట : బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గిరిజన కాలనీలో వీధి కుక్కల దాడిలో బాలుడు గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక గిరిజన కాలనీకి చెందిన ఏడేళ్ల జశ్వంత్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. బాలుడు కింద పడిపోగా నడుముపై, కాళ్లపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై బాలుడిని రక్షించారు. అప్పటికే కాళ్లపై, నడుము, వీపుపై గాయాలు కావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కోనలో గోవులకు పూజలు



గోవులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో మంగళవారం కనుమ పండగ సందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి ఆలయం ముందు దేవస్థానానికి సంబంధించిన గోవులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ జనార్దన్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓ జనార్దన్‌రెడ్డికి నగదు అందిస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన కేతా రవికుమార్‌రెడ్డి, వసంతలక్ష్మి రూ.1,00,116లను విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం మొత్తాన్ని ఈఓ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు.

శీతాకాలం నేస్తాలు

చలికాలంలో ఉన్ని దుస్తులు వెచ్చని నేస్తాలుగా రక్షణనిస్తాయి. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత నుంచి కాపాడుకునేందుకు ప్రజలు స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నెల్లూరు నగరంలో ప్రత్యేకంగా దుకాణాలు పెట్టారు. వాటిల్లో ఆకర్షణీయమైన డిజైన్లు కలిగిన రంగురంగుల స్వెట్టర్లు విక్రయిస్తున్నారు. శీతాకాలం చాలా మందికి ఇష్టమైన సీజన్. ఉన్ని దుస్తులు వేసుకుని తిరిగే వారెందరో..

రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

- ఉన్ని దుస్తులకు ఫుల్ డిమాండ్
- నెల్లూరుకు తరలివచ్చిన ఇతర రాష్ట్రాల వ్యాపారులు
- జోరుగా సాగుతున్న బిజినెస్



నెల్లూరులో ఏర్పాటు చేసిన దుకాణంలో శీతాకాలంలో వినియోగించే రగ్గులు, ఉన్ని దుస్తులు



కొనుగోలు చేస్తూ..

నెల్లూరు(బారకాసు): జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో ప్రజలు స్వెట్టర్లు, ఉన్నితో తయారు చేసిన దుస్తుల కొనుగోళ్లపై మక్కువ చూపుతున్నారు. ఒడిశా, నేపాల్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన విక్రయదారులు నెల్లూరులోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి స్వెట్టర్లు, మంకీ టోపీలు, శాలువాలు, దుప్పట్లు అమ్ముతున్నారు.

సాయంత్రం ఆరు గంటలకే పొగమంచు కురవడం ప్రారంభమవుతోంది. రాత్రి 9 గంటలు దాటితే విపరీతమైన చలితో వణికిపోయే పరిస్థితి. తెల్లవారుజామున ఏడెనిమిది గంటల వరకు పొగమంచు వీడటం లేదు. నగర ప్రజలతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు సాగించే వారందరిని చలి భయపెడుతోంది. దీని నుంచి రక్షణ పొందేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున పనిచేసే పాల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, పేపర్ బాయ్స్ తదితరులు చలి నుంచి తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. నెల్లూరులోని ట్రంకురోడ్డు, పొదలకూరురోడ్డు, మినీబైపాస్‌రోడ్డు, ముత్తుకూరురోడ్డు తదితర చోట్ల దుకాణాలను ఏర్పాటు చేశారు. పలు రకాల డిజైన్లలో స్వెట్టర్లు తదితరాలు లభ్యమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులను ఆకర్షించేలా జంతువుల బొమ్మలతో కూడిన స్వెటర్లు లభిస్తున్నాయి. మహిళలకు ప్రత్యేక స్వెటర్లు కూడా ఉన్నాయి. పెద్దలకు రూ.200 నుంచి రూ.800, చిన్నపిల్లలకు రూ.150 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. అలాగే చలితోపాటు వర్షానికి కూడా తట్టుకునేలా టు ఇన్ వన్ రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని రూ.600 నుంచి రూ.1,200 వరకు అమ్ముతున్నారు.

తయారయ్యే ప్రాంతాలు

ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, నేపాల్‌కు చెందిన కొందరికి నెల్లూరుతో 20 సంవత్సరాలుగా అనుబంధం ఉంది. చలికాలం మొదలవుతుందంటే చాలు వారంతా నగరానికి వచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, లూథియానా, పంజాబ్ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రతి ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు వ్యాపారం సాగిస్తున్నారు. తర్వాత తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. వీరిలో చాలా మంది తెలుగు నేర్చుకున్నారు.

వ్యాపారం చేసి వెళ్లిపోతాం



నెల్లూరు నగరానికి వచ్చి మూడునెలలపాటు ఇక్కడే ఉంటాం. ఉన్ని దుస్తులు అమ్ముకుని ఆ తర్వాత సొంతూరికి వెళ్లిపోతాం. దుస్తులు నాణ్యంగా ఉండటం వల్ల జనం మా దగ్గర కొనుగోలు చేస్తున్నారు. ధరలు అందుబాటులోనే ఉంటాయి. నెల్లూరు ప్రజలు సౌమ్యులు. అందుకే ఈ ఊరుంటే ఇష్టం.

– దిలీప్ సింగ్, రాజస్థాన్

బృందాలుగా వ్యాపారం చేస్తుంటాం



రాజస్థాన్ నుంచి వచ్చాను. మేము బృందాలుగా ఏర్పడి వ్యాపారాలు చేస్తాం. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఆదరిస్తారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లో మా వాళ్లు వ్యాపారాలు చేస్తున్నారు. వచ్చిన లాభంలో కొంత మొత్తాన్ని కుటుంబాల పోషణకు పంపిస్తుంటాం. పెద్ద పెద్ద దుకాణాల్లో కంటే చౌకగా స్వెటర్లు విక్రయిస్తున్నాం. ప్రస్తుతం వ్యాపారం బాగా జరుగుతోంది.

– ఈశ్వర్, రాజస్థాన్

ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎవరు ఎవరితో కలిసినా ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గడప గడపకు మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో దివ్యాంగులు ట్రైసైకిళ్లు కోరినట్లు తెలిపారు. అందులో భాగంగా ఎన్ఎస్సార్ ట్రస్ట్ తరఫున రూ.3లక్షల 85 వేల విలువైన 11 బ్యాటరీ సైకిళ్లను దివ్యాంగులకు అందజేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని తెలియజేశారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డిపై వందేమాతరం శ్రీనివాస్, నల్గొండ గద్దర్ రచించి కంపోజ్ చేసిన పాటలను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మహిళా కౌన్సిలర్లు విడుదల చేశారు.

ఆర్థిక సాయం అందజేత

మండలంలోని నాగమాంబపురం గ్రామానికి చెందిన అల్లాడి విష్ణు అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతని కుటుంబానికి ఎన్ఎస్సార్ ట్రస్టు తరఫున రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. అలాగే తల్లిదండ్రులు లేని ఇద్దరు చిన్నారులు యాదాల దీపిక, యాదాల దివ్యలకు రూ.50 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం



తెప్పపై విహరిస్తున్న దేవదేవేరులు



దీపాలు వదులుతున్న మహిళలు

ఉలవపాడు : రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుని తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో కనుమ పండుగ నాడు మంగళవారం తెప్పోత్సవం నిర్వహించారు. ముందుగా కోనేరు చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దర్శనమిచ్చిన వేణుగోపాలుడు కోనేరులో భక్తజన సందోహం మధ్య వాహనంపై ఊరేగారు. ప్రతి ఏడాది కనుమ రోజు జరిగే తెప్పోత్సవానికి నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకిస్తారు. కాగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ప్రసాద్ ఏర్పాట్లు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి దీపాలు వదిలారు. ఎస్సై బాజిరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పితృదేవతలకు ప్రణమిల్లి..



పెద్దల సమాధి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్



తమ పెద్దల సమాధులకు పూజలు చేస్తున్న కుటుంబసభ్యులు

నెల్లూరు(బృందావనం) : మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ.. అనుబంధాలను గుర్తు చేసుకుంటూ.. చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబసభ్యులు పితృదేవతలకు ప్రణమిల్లి పూజలు చేశారు. నగరంలోని పెన్నాతీరాన బోడిగాడితోట (సమాధుల తోట)లో ఉన్న తమ పితృదేవతలు, పెద్దల, పూర్వీకుల చివరి మజిలీ చెంత మోకరిల్లారు. వారికి ప్రీతికరమైన పిండి వంటలు సమర్పించి, ధూపదీపాలతో పూజలు చేశారు.



పెద్దల ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి

- సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పితృదేవతల ఆశీస్సులు మనకు ఎల్లవేళలా తప్పక ఉంటాయని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. బోడిగాడితోటలో సోమవారం జరిగిన పెద్దల పండగలో ఆయన పాల్గొన్నారు. తొలుత వారి పెద్దల సమాధుల చెంత పూజలు చేశారు. అనంతరం పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దల పండగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. మరణించిన పెద్దలు ఎక్కడ ఉన్నా వారి ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నానన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సంక్రాంతి కల్యాణ్, వంగాల శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



బోడిగాడి తోటకు వస్తున్న నగర వాసులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 246
లేయర్ చికెన్	: 145

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.34
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15

రైలు కింద పడి ఇద్దరి ఆత్మహత్య





గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు నగర పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని అయ్యప్పగుడి ఫ్లైఓవర్ కింద నెల్లూరు వచ్చే రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఈనెల 14వ తేదీ రాత్రి చోటుచేసుకుంది. మృతుడు సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండి నీలం రంగుపై పర్పుల్ రంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బులుగు, ఆరెంజ్ రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించి సోమవారం కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పెన్నా రైల్వే గేటు సమీపంలో..

గుర్తుతెలియని వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్నా రైల్వేగేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై ఈనెల 14వ తేదీ రాత్రి చోటుచేసుకుంది. మృతుడు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు కలిగి ఆరంజ్ రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బులుగు, తెలుపు రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్సై ఎస్.హరిచందన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.